క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం..



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: పట్టణంలోని పద్మశాలీ సంఘం ఈ నెల 24న వనసమారాధన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆమె చాంబర్‌లో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. గోచికొండ సత్యనారాయణ, ఉరవకొండ ధనుంజయ్, సిరిమల్లె రాజు, దోమల మహేశ్వర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూమిపై హక్కులు కల్పించాలి



తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఏజెన్సీలోని ఎస్సీ, బీసీ, మైనార్టీ రైతులకు భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కె.స్వాతి బిందుకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు మాట్లాడుతూ... భూములు ఉండి కూడా పట్టా లేకపోవడంతో ఎస్సీ, బీసీ, మైనార్టీ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ప్రతీ దళిత రైతుకు పట్టా హక్కు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గార్లపాటి సైదులు, బి.లలిత, నేలాల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కోవడం అన్యాయం

ఇల్లెందురూరల్: కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ పేరుతో గిరిజనుల భూములను లాక్కునేందుకు యత్నించడం అన్యాయమని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు వాంకుడోత్ మోతీలాల్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయానికి ఉపయోగపడని భూములను పరిశ్రమల ఏర్పాటుకు ఎంపిక చేయాల్సి ఉండగా కొడంగల్‌లో గిరిజనులు సేద్యం చేసుకుంటున్న భూములలో ఏర్పాటు చేసి వారి పొట్టకొట్టే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తన ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు ఉద్యమిస్తారని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం చార్జీలు పెంచాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ధరలు పెంచాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఇల్లెందు ఎంఈఓ స్వామికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్యా అభిమన్యు మాట్లాడుతూ... పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు లేక చీకటి గదుల్లో బోధన సాగించాల్సి వస్తోందన్నారు. పాఠశాలల్లో మంచినీటి సదుపాయం లేదన్నారు. అరుణ్, అభిషేక్, లెనిన్, ఉదయ్, రాహుల్, వంశీ, మధు, పవన్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జాతీయ బాలల దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో స్వయం పాలన (సెల్ఫ్ టీచింగ్) దినాన్ని జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. వివిధ జాతీయ నాయకుల వేషాధారణలలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్




కొత్తగూడెంఅర్బన్: గిరిజన బాలికల హాస్టల్‌లో...



కొత్తగూడెం లైబ్రరీ హాల్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



పాల్వంచ: శేఖరం బంజర స్కూల్‌లో...





ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్, కొమరారం హైస్కూళ్లలో పాఠాలు బోధిస్తున్న విద్యార్థినులు



సింగరేణి(కొత్తగూడెం): సెయింట్ జోసెఫ్ పాఠశాలలో..



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో...



జూలూరుపాడు: కాకర్ల హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం



కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో...



టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో..

దాడి చేసిన వారిని శిక్షించాలి



టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వికారాబాద్ జిల్లా లగచర్లలో విధి నిర్వహణలో ఉన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, కొండగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, ఇతర అధికారులపై రైతుల ముసుగులో జరిపిన దాడిని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్నా కొత్తగూడెం ఎమ్మెల్యే మినహా ఎవరూ ఖండించక పోవడం బాధాకరమన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రమాదేవి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఎ.రామారావు, టీజీఓ జిల్లా అధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్య, వివిధ సంఘాల బాధ్యులు భార్గవ్ చైతన్య, ఉమామహేశ్వర్, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రంగప్రసాద్, వనమా శ్రీనివాస్, పాషా, విజయలక్ష్మి, ఉష, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: లగచర్ల గ్రామంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు పలువురు జిల్లా అధికారులపై దాడి చేయడం సరైంది కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలియజేయాల్సి ఉండగా జిల్లా అధికారులపై దాడులు చేయడం అప్రజాస్వామికమని ప్రభుత్వ అధ్యాపకులు అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బసవమ్మ, అధ్యాపకులు ముంతాజ్ ఆలీ, వేణుగోపాల్, యాకూబ్, వరలక్ష్మి, శ్రీనివాస్‌రావు, ప్రమోద్‌కుమార్, నాగేశ్వర్‌రావు, సంజీవరెడ్డి, రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు..

సుజాతనగర్: సీసీఐ ఆధ్వర్యంలో స్థానిక జిన్నింగ్ మిల్లులో గురువారం పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. డేగలమడుగు గ్రామంలోని మంజీత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను ఇటీవలే ప్రారంభించినా.. రెండు రోజుల నుంచే ఇక్కడ పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 3 వేల క్వింటాళ్ల పత్తి నిల్వలు మిల్లుకు రాగా... గురువారం ఒక్కరోజే సుమారు 3 వేల క్వింటాళ్ల పత్తి వచ్చినట్లు సీసీఐ అధికారులు తెలిపారు. శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల పాటు సెలవుల నేపథ్యంలో గురువారం సుమారు వందలాది వాహనాల్లో పెద్దఎత్తున పత్తి తరలి వచ్చింది. సీసీఐ ఆధ్వర్యంలో 8 నుంచి 12 శాతం తేమ ఉంటే రూ.7,521 నుంచి రూ.7,220 చెల్లిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు నాణ్యత లేదనే సాకుతో రూ.6 వేల నుంచి రూ.6,500 ధరే చెల్లిస్తుండటంతో ఎక్కువ మంది రైతులు సీసీఐకే మొగ్గుచూపుతున్నారు.



జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి లోడ్లతో వాహనాలు

మాలధారులకు ఉచిత భోజనం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మశాస్త్రాలయంలో అయ్యప్పస్వామి మాలధారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత భోజన కార్యక్రమాన్ని గురువారం డాక్టర్ ఏ.నాగరాజు ప్రారంభించారు. అదేవిధంగా రాత్రి అల్పాహార కార్యక్రమాన్ని ఆలయ వైస్ చైర్మన్ పీవీ వర్ధన్‌రావు ప్రారంభించారు. మాట్లాడుతూ.. అయ్యప్ప మాలధారులు, భవాని మాతా దీక్షాపరులు, ఆంజనేయస్వామి దీక్షాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి: కొత్తగూడెం, ఇల్లెందు పరిసర ప్రాంతాల ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రయాణికులు, ప్రజలు మధ్యాహ్నం 3నుంచి 4 గంటల వరకు 99592 25959 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాల్వంచరూరల్: మండల పరిధి సోములగూడెం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీరామ్మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 45 సంవత్సరాల లోపు ఉండాలని, ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో ఏడుగురు ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీరామ్

సింగరేణి(కొత్తగూడెం): శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఖాళీలను భర్తీ చేయటానికి జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 26 మంది హాజరు కాగా ఏడుగురిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు జిల్లా ఉపాధి కల్పనా శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

వే బ్రిడ్జిల తనిఖీ

జూలూరుపాడు: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు సమీపంలోని వే బ్రిడ్జిలను జిల్లా తూనికలు, కొలతల అధికారి కె.మనోహర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాట్లాడుతూ... తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ బరువు ఉంటే ఎలక్ట్రానిక్ కాంటాతో పత్తి తూకం వేయించుకోవాలని రైతులకు సూచించారు. టన్ను బరువు కంటే అధికంగా ఉంటే వే బ్రిడ్జిపై తూకం పెట్టుకోవాలన్నారు.

బొగ్గు నాణ్యతా వారోత్సవాలు ప్రారంభం



ఇల్లెందు: నాణ్యత ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఇల్లెందు/టేకులపల్లి: సింగరేణి పరిధి ఇల్లెందు ఏరియాలో బొగ్గు నాణ్యతా వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో ఓఎస్డీ ఈసం కృష్ణయ్య పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించాక మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణాలో రికార్డులు నమోదు చేస్తుండగా నాణ్యతను కొనసాగించేలా ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. వివిధ విభాగాల అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, రామస్వామి, నరసింహరాజు, రవికుమార్, బాలాజీనాయుడు, రామదాసు, ధనుంజరెడ్డి, పులి పూర్ణచందర్, శివప్రసాద్, మధుబాబు, అంజిరెడ్డి, దిలీప్ కుమార్, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే, టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓసీలో గని మేనేజర్ సౌరభ్ సుమన్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి అందరూ కృషి చేయాలని, తద్వారా వినియోగదారులకు సంస్థపై నమ్మకం కొనసాగుతుందని తెలిపారు. అధికారులు రవికుమార్, బ్రహ్మం, విశ్వనాథరెడ్డి, నాయకులు సర్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్ల అసోసియేషన్ కమిటీకి అభినందనలు



సీఈకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిటీ సభ్యులు

పాల్వంచ: కేటీపీఎస్ 5,6 దశల తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికైన నూతన కమిటీని గురువారం సీఈ ఎం.ప్రభాకర్‌రావు అభినందించారు. బ్రాంచి సెక్రటరీగా నియామకమైన డి.ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ ఎం.చంద్రకళాధర్, రిప్రజెంటెటివ్ వి.పావని, అసిస్టెంట్ సెక్రటరీలు ఎన్.ప్రదీప్, టి.దివాకర్, కె.మధుసూదన్, బి.రామారావు, డి.శ్రీలక్ష్మి, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, సీహెచ్.రాజాబాబు స్థానిక సీఈ కార్యాలయంలో సీఈని మర్యాద పూర్వకంగా కలిశారు.

అదేవిధంగా కేటీపీఎస్ 7వ దశ బ్రాంచ్ సెక్రటరీగా నియామకమైన యాస్మిన్‌ను 1535 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ, ప్రాంతీయ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ధనయ్య, బాలాజీ, నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఐ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతన్న రాంచందర్ నాయక్

టేకులపల్లి: సీపీఐ పురోభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రామ్ చందర్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ వేడుకలు గ్రామగ్రామాన జరుపుకోవాలన్నారు. 1925లో పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకుల కోసం సీపీఐ ఆవిర్భించిందన్నారు. ఈ నూరేళ్లలో అనేక కష్టాలు, నష్టాలు ఆటుపోట్లు ఎదురయ్యాయని ఈ సుదీర్ఘ పోరాటంలో ఎన్నో త్యాగాలు ఉన్నాయన్నారు. ప్రజల పక్షాన నిలబడిన సీపీఐ ఎర్రజెండా నేటికీ రెపరెపలాడుతూనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎజ్జు భాస్కర్, బానోత్ వీరన్న, ఇస్లావత్ రవీందర్, శ్రీను, భద్రయ్య, శ్రీరాములు, లక్ష్మణ్, సతీష్, సోనీ పాల్గొన్నారు.

వారోత్సవాల్లోనే గ్రంథాలయం ప్రారంభం

ఇల్లెందు: ఇల్లెందులో నిర్మాణం పూర్తయిన గ్రంథాలయ భవనాన్ని తాజాగా మొదలైన గ్రంథాలయ వారోత్సవాల్లోనే ప్రారంభోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిశారు. ఇల్లెందులో రూ.2కోట్ల నిధులతో అన్ని హంగులతో నిర్మించిన గ్రంథాలయ భవనం ఏడాది కాలంగా నిరుపయోగంగా మారిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రూ.4.50 లక్షల నిధులు నిల్వ ఉన్నందున వాటితో అవసరమైన ఫర్నీచర్ సమకూర్చాలని నిర్ణయించినట్లు చెప్పగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాగా, గ్రంథాలయంలో వసతుల కల్పన, పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలు అదనపు నిధులను కేటీపీఎస్, బీపీఎల్ ద్వారా సేకరించేందుకు ఆయా సంస్థల అధికారులను కలవాలని నిర్ణయించారు.

దీపం.. దైవస్వరూపం..

నేడు కార్తీక పౌర్ణమి

- ముస్తాబైన ఆలయాలు
- దీపారాధనకు ఏర్పాట్లు చేసుకుంటున్న మహిళలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు (ఫైల్)

ఇల్లెందురూరల్: దేవుడి ముందు దీపాన్ని వెలిగించడంలో మన పూర్వీకులు వేదాంత విషయాలను చెబుతుంటారు. ప్రమిదలోని వత్తిని శరీరంగా, జ్వాలను ప్రాణంగా, నూనెను కర్మఫలంగా చెబుతారు. కర్మఫలం అనే నూనె ఉన్నంత వరకు వత్తి అనే శరీరంలో జ్వాల అనే ప్రాణం ఉంటుందని బోధిస్తుంటారు. అన్ని మతాల్లోనూ దీపంలో భగవత్ స్వరూపం ఇమిడి ఉంటుందంటారు. అంతటి పవిత్రమైన దీపం ప్రాముఖ్యతను తెలియచెప్పే కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని శుక్రవారం ప్రజలందరూ దీప తోరణోత్సవంగా నిర్వహిస్తారు.

దీపారాధనలోనూ రకాలు..

భగవంతుని పూజించేందుకు 16 విధాల ఉపచారాలను ఆచరించాలని హిందూ ధర్మశాస్త్రం సూచిస్తోంది. అందులో దీపాన్ని వెలిగించడమనే ఆచారం అనాదిగా వస్తోంది. ఇందుకోసం ఉపయోగించే వత్తుల్లో కూడా పలు రకాలున్నాయి. ఓం నమశ్శివాయ వత్తులు, పత్తి, అరటినార వత్తులు, ఎరుపు, పసుపు వంటి రంగుల్లోని వస్త్రాల పీలికలతో చేసిన వత్తులు, తెల్లజిల్లేడు వత్తులు.. ఇలా పలు విధాల వత్తులు వాడుకలో ఉన్నాయి. ఒక్కోవత్తులతో వెలిగిస్తే ఒక్కో రకమైన ఫలాలు పొందవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రమిదలో ఎన్ని వత్తులు ఉంచాలనేందుకు, ఆ వత్తులు ఏ దిక్కుకు తిరిగి ఉంచాలనేందుకు కూడా పలురకాల విషయాలు ఉన్నాయి. దీపాన్ని వెలిగించేందుకు ఉపయోగించే నూనెల్లో కూడా రకాలు ఉన్నాయి. నువ్వుల నూనె, కొబ్బరి నూనె, మంచి నూనె, ఆముదం, పామాయిల్ వంటి వాటిని సాధారణంగా వినియోగిస్తారు. ఆవు నెయ్యితో దీపం వెలిగించడం అన్నింటా శ్రేయస్కరమని పూర్వీకులు చెబుతున్నారు. ఒక్కో దేవతామూర్తి ముందు దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన ఫలితాలు ఉంటాయంటున్నారు. గణపతి, అమ్మవార్లు, విష్ణు, శివ, నవగ్రహాలకు దీపాలు వెలిగించడం ఆచారంగా వస్తోంది.

దీప తోరణోత్సవం.. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని దీపతోరణోత్సవం అని పిలుస్తారు. దీపాలను తోరణాల మాదిరిగా తీర్చి దేవతామూర్తులను ఉపాసించడం వల్ల దుష్టశక్తుల నాశనమవుతాయని విశ్వాసం. ప్రహరీలు, దేవతా విగ్రహాల ముందు, ఆలయ ప్రాంగణాల్లో వివిధ ఆకారాల్లో, వరుసల్లో దీపాలు కొలువుదీరి ఆకట్టుకుంటాయి. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం దీపారాధనోత్సవానికి మహిళలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

దీపం.. ప్రాముఖ్యం.. భగవదారాధనలో పూర్వం నుంచి రకరకాల పదార్థాలతో తయారు చేసిన ప్రమిదలతో దీపాలను వెలిగించే ఆచారం ఉంది. ఒక్కో రకమైన ప్రమిదలో దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన మంచి జరుగుతుందని ప్రచారంలో ఉంది. మట్టి ప్రమిదల్లో దీపం వెలిగిస్తే దైవానుగ్రహం కలుగుతుందని.. పింగాణి ప్రమిదల్లో వెలిగిస్తే ఆ ఇంటివారికి అలంకార వస్తువులు సమకూరుతాయని.. ఇత్తడి ప్రమిదలో దీపాలను వెలిగిస్తే ఆ ఇంట్లో దైవశక్తి అధికమవుతుందని.. కంచు ప్రమిదలో వెలిగిస్తే ఆయుష్షు పెరుగుతుందని.. నిమ్మ ప్రమిదలో దీపం వెలిగిస్తే అన్ని కార్యాల్లోనూ విజయం సిద్ధిస్తుందని.. అరటి దోనెలో వెలిగించి నీటిలో వదిలితే మానసిక సంతృప్తి, ధనరక్షణ కలుగుతుందని.. ఉసిరికాయల దీపం వెలిగిస్తే పాపాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసంగా పెద్దలు చెబుతున్నారు.

బ్రహ్మ ముహూర్తంలో దీపారాధన



కొత్తగూడెంటౌన్: కార్తీక మాసం అంటేనే శివుడు. విష్ణువుకు ప్రీతిపాత్రమైనది. కార్తీక మాసంలో పౌర్ణమి రోజున అభిషేకాలు, హోమాలు చేసి భక్తిశ్రద్ధలతో కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. పౌర్ణమి రోజు బ్రహ్మ ముహూర్తంలో దీపారాధన చేయడం మంచి ఫలితాలను ఇస్తుంది.

– మధుకుమారాచార్యులు, అర్చకులు, పాండురంగ భజన మందిరం, కొత్తగూడెం

కార్తీకమాసం పవిత్రమైంది..



కార్తీకమాసం పరమేశ్వరుడు, నారాయణడికి ప్రీతికరమైంది. ఈ మాసంలో ప్రతీ సోమవారం శివుడికి, విష్ణువుకు ప్రత్యేక పూజలు చేస్తారు. అయ్యప్పల దీక్షలు ప్రారంభమయ్యేది ఈ మాసంలోనే. శివునికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, విష్ణువుకు తులసి అర్చనలను నిర్వహిస్తారు. వీరితోపాటు లక్ష్మీదేవి, తులసీమాత, ఉసిరి చెట్టుకు పూజలు చేస్తారు.

– జిల్లోజు రామాచార్యులు, అర్చకులు, కొమరారం

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు..



చుంచుపల్లి: సహకార జెండా ఎగురవేస్తున్న చైర్మన్ మండే హనుమంతరావు



జూలూరుపాడు కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న చైర్మన్ భిక్షం, డైరెక్టర్లు, సిబ్బంది



టేకులపల్లి: బేతంపూడి సొసైటీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న చైర్మన్ సురేందర్‌రావు

చుంచుపల్లి: అఖిల భారత 71వ సహకార వారోత్సవాల సందర్భంగా కొత్తగూడెం సొసైటీ కార్యాలయంలో గురువారం సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు సహకార జెండాను ఆవిష్కరించారు. మాట్లాడతూ.. సహకార వ్యవస్థ బలోపేతం కోసం ప్రతీ రైతు తనవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ భూక్యా రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు బండి అమృతరావు, గుగులోతు చందర్, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, సెక్రటరి పండ్ల సారయ్య రైతులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 71వ సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అధ్యక్షుడు చీమలపాటి భిక్షం సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు కొమ్మినేని పాండురంగారావు, మనుబోలు తిరువెంగళరాజు, చాపలమడుగు రామ్మూర్తి, భూక్యా జవహర్‌లాల్, పాపిన్ని వెంకయ్య, కళ్లోజి రజినీ, శీరంశెట్టి రామారావు, రెడ్డిబోయిన రాము, ఎన్.వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

టేకులపల్లి: సహకార వారోత్సవ వేడుకలు గురువారం బేతంపూడి సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు సహకార సంఘం జెండా ఎగురవేశారు. సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.